

అధికారంలోకి తీసుకురావాలి

కాంగ్రెస్‌ను అధికారంలోకి తీసుకురావాలని యూత్ కాంగ్రెస్ ఎలక్షన్ కమిటీ చైర్మన్ సమరత్ మిశ్రా అన్నారు. - 8లో



నీట మునిగి విద్యార్థుల మృతి

ఇద్దరు విద్యార్థులు నీటి గుంటలో మునిగి ప్రాణాలు విడిచిన సంఘటన కోదాడ మండలం రెడ్లకుంటలో జరిగింది. - 8లో



కార్మికులకు మంచి రోజులు

ఆర్టీసీ కార్మికులకు మంచి రోజులు వచ్చాయని మజ్దూర్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి థామస్‌రెడ్డి అన్నారు. - 8లో

న్యూస్‌రీల్

11న సివిల్ సర్వీసెస్ క్రీడలకు ఎంపిక పోటీలు

నల్లగొండ టూటౌన్: హైదరాబాద్‌లో ఈనెల 18 నుంచి 22 వరకు జరుగనున్న రాష్ట్ర స్థాయి సివిల్ సర్వీసెస్ క్రీడోత్సవాలకు గాను ఈనెల 11న నల్లగొండలోని అవుట్ డోర్ స్టేడియంలో ఉదయం 10.30 గంటలకు ఎంపిక పోటీలు నిర్వహించబడునని జిల్లా యువజన, క్రీడల అధికారి మక్బుల్ అహ్మద్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అథ్లెటిక్స్, బాస్కెట్‌బాల్, బ్యాడ్మింటన్, క్రికెట్, చెస్, క్యారమ్స్, ఫుట్‌బాల్ (పురుషులు), హాకీ, కబడ్డీ, లాన్ టెన్నిస్, పవర్ లిఫ్టింగ్, స్విమ్మింగ్, టేబుల్ టెన్నిస్, వాలీబాల్, వెయిట్ లిఫ్టింగ్, రెజ్లింగ్ (పురుషులు), బెస్ట్ ఫిసిక్ (పురుషులు) పోటీలు ఉంటాయని పేర్కొన్నారు. ఇక్కడ ఎంపికైన వారిని హైదరాబాద్‌లో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు పంపుతామని తెలిపారు. వివిధ ప్రభుత్వ శాఖల్లో పనిచేసే ఆసక్తి గల ఉద్యోగులు సర్వీస్ సర్టిఫికెట్ లేదా ఇటీవల తీసిన ఐటెంటిటీ కార్డుతో హాజరు కావాలని కోరారు.

కొనసాగుతున్న మద్యం టెండర్లు

నల్లగొండ క్రైం: జిల్లాలో 155 మద్యం దుకాణాలకు టెండర్లు కొనసాగుతున్నాయి. దీంట్లో భాగంగా బుధవారం 26 దరఖాస్తులు అందాయి. వీటితో మొత్తం 224 దరఖాస్తులు అందినట్లు జిల్లా ఎక్సైజ్ అధికారి సంతోష్ ఒక ప్రకటనలో తెలిపారు.

ఎంజీయూలో అధికారుల మార్పు

నల్లగొండ రూరల్: మహాత్మాగాంధీ యూనివర్సిటీలో వివిధ విభాగాలకు చెందిన అధికారులను మారుస్తూ బుధవారం యూనివర్సిటీ రిజిస్ట్రార్ కృష్ణారావు ఉత్తర్వులు జారీ చేశారు. బిజినెస్ మెనేజ్‌మెంట్ బోర్డు ఆఫ్ స్టడీస్ చైర్మన్‌గా ఎం.రమేష్, కామర్స్ విభాగంలో బోర్డు ఆఫ్ స్టడీస్ చైర్మన్‌గా ఈసీ సభ్యురాలు శ్రీదేవి, ఇంజనీరింగ్‌లో ఈసీఈ విభాగం అధిపతిగా అవినాష్‌ను నియమించినట్లు ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

కాంగ్రెస్ 'పల్లె నిద్ర'



గిరిజనులతో మాట్లాడుతున్న డీసీసీ అధ్యక్షుడు శంకర్‌నాయక్

అడవిదేవులపల్లి: తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తేనే గిరిజనులకు మేలు జరుగుతుందని డీసీసీ అధ్యక్షుడు కేతావత్ శంకర్ నాయక్ అన్నారు. ఆదివాసీల దినోత్సవం సందర్భంగా తెలంగాణ పీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు అడవిదేవులపల్లి మండలం జిలకరకుంటతండా గ్రామంలో బుధవారం రాత్రి పార్టీ నాయకులతో కలిసి ఆయన పల్లె నిద్ర చేశారు. ఈ సందర్భంగా గిరిజనులను ఉద్దేశించి మాట్లాడారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పొదిల శ్రీనివాస్, మండల పార్టీ అధ్యక్షుడు రమావత్ బాలునాయక్, హన్మంతు, గుండా శ్రీనివాస్, హనుమయ్య, మంత్రు తదితరులు పాల్గొన్నారు

తాత్కాలికంగా సమ్మె విరమణ



డీపీఓ విష్ణువర్ధన్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

నల్లగొండ టౌన్: పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు హామీ మేరకు సమ్మెను తాత్కాలికంగా విరమిస్తున్నట్లు గ్రామ పంచాయతీ ఉద్యోగులు, కార్మిక సంఘాల జేఏసీ ప్రకటించింది. ఈ మేరకు బుధవారం సమ్మెను తాత్కాలికంగా విరమిస్తున్నట్లు జిల్లా పంచాయతీ అధికారి విష్ణువర్ధన్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీ ఉద్యోగుల, కార్మిక సంఘాల జేఏసీ జిల్లా చైర్మన్ చినపాక లక్ష్మీనారాయణ మాట్లాడుతూ హామీ అమలు కాకపోతే మళ్లీ పోరాటం చేయక తప్పదని హెచ్చరించారు. కార్మికులందరికీ సమాన పనికి సమాన వేతనాలు ఇవ్వాలని, పెండింగ్ వేతనాలను చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు తుమ్మల వీరారెడ్డి, పి.వినోద్‌కుమార్, ఏర్పుల యాదయ్య, సత్యనారాయణ, సాంబయ్య, అంజయ్య , జహీర్, కోటయ్య, సైదులు, ఎల్లయ్య, సర్వయ్య, నరేష్ ఎల్లేష్, యాదమ్మ, స్వప్న, మంగారెడ్డి, కోటేశ్వర్‌రావు, కొండల్, షకీల్ తదితరులు పాల్గొన్నారు.

న్యాయవాదులకు క్రీడాపోటీలు



క్యారమ్ పోటీలను ప్రారంభిస్తున్న జిల్లా ప్రధాన జడ్జి నాగరాజు

రామగిరి(నల్లగొండ): పంద్రాగస్టును పురస్కరించుకొని బుధవారం జిల్లా కోర్టులో బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులకు నిర్వహించిన క్రీడా పోటీలను జిల్లా ప్రధాన జడ్జి ఎం.నాగరాజు బుధవారం ప్రారంభించారు. కార్యక్రమలలో మొదటి అదనపు జడ్జి జయరాజు, ఎస్సీ, ఎస్టీ స్పెషల్ జడ్జి తిరుపతి, ఫ్యామిలీ కోర్టు జడ్జి సంపూర్ణ ఆనంద్, సీనియర్ సివిల్ జడ్జి తేజోకార్తీక్, ఎక్సైజ్, మొబైల్ కోర్టు మేజిస్ట్రేట్‌లు శ్రీవాణి, సౌందర్య, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నేతి రఘుపతి, సెక్రటరీ జె.రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

దేశాన్ని కాపాడుకుందాం

నల్లగొండ టౌన్: కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, రైతు వ్యతిరేక విధానాలను క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో తిప్పికొడుతూ దేశాన్ని కాపాడుకుందామని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తుమ్మల వీరారెడ్డి, ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి పల్లా దేవేందర్‌రెడ్డి, ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు అంబటి సోమన్న పిలుపునిచ్చారు. కేంద్ర కార్మిక సంఘాల పిలుపు మేరకు బుధవారం నల్లగొండ కలెక్టరేట్ ఎదుట నిరసన వ్యక్తం చేసి మాట్లాడారు. కార్యక్రమంలో నా యకులు చినపాక లక్ష్మీనారాయణ, నూనె వెంకటస్వామి, తనీరు యాదయ్య, ఎండీ.సలీం, దండెంపల్లి సత్తయ్య, ఏర్పుల యాదయ్య, అద్దంకి నర్సింహ, భీమగాని గణేష్, పోలె సత్యనారాయణ, విజయలక్ష్మి పాల్గొన్నారు.



నల్లగొండలోని కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న ప్రజా సంఘాల నేతలు, కార్మికులు

గృహలక్ష్మి.. కిక్కిరిసి



నల్లగొండ మున్సిపల్ కార్యాలయంలో దరఖాస్తులు అందిస్తున్న జనం



నల్లగొండ తహసీల్దార్ కార్యాలయంలో కిక్కిరిసిన అర్జీదారులు

రెండు రోజుల్లో 12 వేలకుపైగా దరఖాస్తులు

- రద్దీగా తహసీల్దార్ కార్యాలయాలు
- మున్సిపల్ ఆఫీసుల్లోనూ ప్రత్యేక కౌంటర్లు
- ఒక్క రోజే గడువు ఉండడంతో పెద్ద ఎత్తున తరలి వస్తున్న జనం

నల్లగొండ: గృహలక్ష్మి పథకానికి దరఖాస్తు చేసుకునేందుకు జిల్లాలో వివిధ వర్గాల ప్రజలు పెద్దఎత్తున తరలి వస్తున్నారు. ఈ పథకం కింద ఇంటి నిర్మాణానికి రూ.3లక్షల ఆర్థికసాయం చేస్తామని ప్రభుత్వం ప్రకటించడంతో అర్జీలు పెట్టుకునేందుకు జనం బారులుదీరుతున్నారు. ఇందుకు ప్రభుత్వం కేవలం మూడు రోజులు మాత్రమే గడువు ఇచ్చింది. అయితే గురువారం ఆఖరి తేదీ కావడం, ఒక్క రోజే మిగిలి ఉండడంతో జనం ఒక్కసారిగా తహసీల్దార్ కార్యాలయాలు, మున్సిపాలిటీల్లో ఏర్పాటు చేసిన ప్రత్యేక కౌంటర్ల వద్దకు భారీగా తరలి వస్తున్నారు. దీంతో ఒకపక్క గృహలక్ష్మి దరఖాస్తుదారులు.. మరోపక్క ఆ పథకానికి కావాల్సిన ధ్రువీకరణ పత్రాల కోసం అర్జీలు పెట్టుకునే వారితో జిల్లావ్యాప్తంగా ఉన్న తహసీల్దార్ కార్యాలయాలు, మున్సిపల్ ఆఫీసుల్లోని కౌంటర్లు, మీ సేవ కేంద్రాలు జనంతో కిటకిటలాడుతున్నాయి.

మొదటి రోజు 2,500 దరఖాస్తులు..

మొదటి రోజు బుధవారం జిల్లాలో 2,500 మంది గృహలక్ష్మి పథకానికి దరఖాస్తు చేసుకున్నారు. అయితే దరఖాస్తులను తమ నియోజకవర్గాల పరిధిలో ఎమ్మెల్యేలు కూడా స్వీకరిస్తుండడంతో చాలా మంది అక్కడే దరఖాస్తులు ఇస్తున్నారు. దీంతో దరఖాస్తుల సంఖ్య మరింత పెరగనుంది. అయితే రెండో రోజైన గురువారం కూడా దరఖాస్తులు చేసేందుకు ప్రజలు కౌంటర్ల ముందు బారులుదీరారు. నల్లగొండ తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కౌంటర్ల వద్ద పెద్దఎత్తున దరఖాస్తులు చేసుకున్నారు. జిల్లా అంతట కూడా ఇదే పరిస్థితి నెలకొంది. జిల్లా వ్యాప్తంగా రెండో రోజు సాయంత్రం వరకు 10వేలకు పైగా దరఖాస్తులు వచ్చాయి.

మహిళలే అర్హులైనప్పటికీ..

అయితే మహిళల పేరు మీద ఇంటి స్థలం ఉన్న వారు మాత్రమే గృహలక్ష్మి పథకానికి అర్హులని ప్రభుత్వం స్పష్టంగా తెలిపింది. అయినప్పటికీ పురుషుల పేరు మీద ఇంటి స్థలం ఉన్నవారు కూడా దరఖాస్తు చేసుకుంటున్నారు. కౌంటర్ల వద్ద రద్దీ ఉండడంతో ప్రస్తుతం అన్ని దరఖాస్తులను తీసుకుంటున్నారు. ఆ తరువాత వాటన్నింటినీ పరిశీలించి మహిళల పేరుమీద ఇంటి స్థలం ఉన్న వారిని మాత్రమే అర్హులుగా ఎంపిక చేయడం జరుగుతుందని అధికారులు చెబుతున్నారు.

నేడే చివరి గడువు

గృహలక్ష్మి పథకానికి శుక్రవారం ఒక్కరోజు మాత్రమే గడువు ఉంది. మొదటి రోజు అంతంత మాత్రంగానే దరఖాస్తు చేసుకోగా రెండో రోజు భారీగా దరఖాస్తులు చేసుకున్నారు. చివరి రోజు మరింత మంది దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం ఉంది.

దరఖాస్తు గడువు పెంచాలి



గృహలక్ష్మి పథకానికి దరఖాస్తు చేసుకునేందుకు నల్లగొండ తహసీల్దార్ కార్యాలయానికి వచ్చాను. దరఖాస్తులు ఇచ్చేందుకు చాలా మంది జనం వచ్చారు. సర్టిఫికెట్లు అందుబాటులో లేక తిరిగి ఇంటికెళ్లాను. దరఖాస్తు గడువును పెంచాలి.

– మమత, దుప్పలపల్లి

చంద్రబాబు డైరెక్షన్‌లో పనిచేస్తున్న రేవంత్

- ఫ్రస్టేషన్‌తోనే సీఎంపై విమర్శలు
- శాసన మండలి చైర్మన్ సుఖేందర్‌రెడ్డి



మాట్లాడుతున్న గుత్తా సుఖేందర్‌రెడ్డి

నల్లగొండ టూటౌన్ : సొంత ప్రయోజనాలకు, దోపిడీ కోసం అధికారం కావాలంటున్న రేవంత్ రెడ్డి.. టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు డైరెక్షన్‌లో సిపాయిగా పనిచేస్తున్నారని శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి అన్నారు. బుధవారం నల్లగొండలోని తన క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సుఖేందర్ రెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణ ఉద్యమం చేసి రాష్ట్రాన్ని సాధించి తొమ్మిదిన్నర సంవత్సరాల్లో దేశంలోనే మొదటి స్థానంలో నిలబెట్టిన సీఎం కేసీఆర్‌పై పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ఫ్రస్టేషన్‌తో విమర్శలు చేస్తున్నారని అన్నారు. ఒక ముఖ్యమంత్రికి పిండం పెడతామని చావును కోరుకోవడం లాంటి వ్యాఖ్యలను ప్రజాస్వామ్య వాదులంతా ఖండించాలన్నారు. రాష్ట్రాన్ని ఇవ్వడంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఆలస్యం చేసినందునే వేలాది మంది ఆత్మబలిదానాలు చేసుకున్నారని తెలిపారు. రెండు జాతీయ పార్టీల నాయకులకు చిత్త శుద్ధి లేదని, రాష్ట్ర విభజనలో రాష్ట్రానికి రావాల్సిన ప్రాజెక్టులు, కృష్ణా జలాల పంపిణీ నేటికి ఎందుకు తేల్చలేదని ప్రశ్నించారు. ఒక్క చాన్స్ ఇవ్వాలంటున్న కాంగ్రెస్ నాయకులు యాభై ఏళ్ల అవకాశం వస్తే ఏం చేశారని ప్రశ్నించారు. తెలంగాణపై విషం చిమ్ముతున్న బీజేపీకి ఓట్లు అడిగే హక్కు లేదని, కాంగ్రెస్, బీజేపీ నాయకులకు అధికారం పగటి కలగానే మిగిలిపోతుందన్నారు. అడ్డగోలుగా మాట్లాడే ఒక పార్టీ అధ్యక్షుడు పోయాడని, మరో పార్టీ అధ్యక్షుడు ఎప్పుడు పోతాడో తెలియదన్నారు. కేంద్ర మంత్రిగా ఉన్న కిషన్‌రెడ్డి రాష్ట్రానికి ఒక్క ప్రాజెక్టును కూడా తేలేదన్నారు.

వినియోగదారులను మోసం చేస్తే చర్యలు తప్పవు

- తూనికలు, కొలతల శాఖ జిల్లా అధికారి రామకృష్ణ



దుకాణంలో తనిఖీ చేస్తున్న అధికారులు

నల్లగొండ టూటౌన్: తూకం, కొలతల విషయంలో వినియోగదారులను మోసం చేసే దుకాణదారులపై చట్టపరంగా చర్యలు తప్పవని తూనికలు, కొలతల శాఖ జిల్లా అధికారి రామకృష్ణ హెచ్చరించారు. నల్లగొండ పట్టణంలోని పలు దుకాణాలు, కూరగాలయ షాపుల్లో తూనికలు, కొలతల శాఖ అధికారులు, ధరల నియంత్రణ కమిటీ టాస్క్‌ఫోర్స్ బృందం సభ్యులు బుధవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ప్రకాశం బజారు, హైదరాబాద్, డీవీకే రోడ్లలో బియ్యం దుకాణాలను తనిఖీ చేసి తూకాలను పరిశీలించారు. శ్రీ శ్రీనివాస రైస్ మర్చంట్, సాయి గణేష్ రైస్ మర్చంట్ దుకాణాల్లో 25 కేజీల బస్తాలను తూకం వేసి చూడగా 600 గ్రాములు తక్కువగా ఉన్నట్లు తేలింది. బస్తాలపై ధర కూడా లేకపోవడంతో సంబంధిత దుకాణాలపై కేసులు నమోదు చేశారు. అలాగే అధిక ధరలకు విక్రయిస్తున్నారని ఫిర్యాదులు రావడంతో జిల్లా కలెక్టర్ ఆదేశాలతో టాస్క్‌ఫోర్స్ అధికారులు కిరాణ, కూరగాయల మార్కెట్‌లో దుకాణాలను తనిఖీ చేసి ధరలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా తూనికలు, కొలతల శాఖ జిల్లా అధికారి రామకృష్ణ మాట్లాడుతూ వ్యాపారస్తులంతా ప్రభుత్వ నిబంధనలు కచ్చితంగా పాటించాలన్నారు. వేర్వేరుగా నిర్వహించిన ఈ తనిఖీల్లో నల్లగొండ ఇన్స్‌పెక్టర్ వి.శ్రీనివాసులు, టాస్క్ ఫోర్స్ అధికారులు దీప్తి, షేక్ జావిద్, డి.లింగస్వామి, తూనికలు కొలతల అధికారి రామకృష్ణ, మున్సిపల్ శానిటరీ ఇన్స్‌పెక్టర్ జి.శ్రీనివాస్, జిల్లా వినియోగదారుల సమాచార కేంద్రం కన్వీనర్ గురువయ్య తదితరులు పాల్గొన్నారు.

బ్రాహ్మణ పథకాలకు దరఖాస్తులు చేసుకోవాలి



మాట్లాడుతున్న వేణుగోపాల్‌రావు

రామగిరి(నల్లగొండ): తెలంగాణ బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ అమలు చేస్తున్న పథకాలకు దరఖాస్తు చేసుకోవాలని అఖిల బ్రాహ్మణ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బొల్ల వేణుగోపాల్‌రావు కోరారు. బుధవారం నల్లగొండలోని పరిషత్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పేద బ్రాహ్మణ కుటుంబాలకు చెంది టెన్త్ పాసైన 18 నుంచి 24 ఏళ్ల వయస్సు గల నిరుద్యోగ యువతకు తెలంగాణ అకాడమీ ఆఫ్ స్కిల్ అండ్ నాలెడ్జ్ సంస్థ నందు శిక్షణ ఇచ్చి అనంతరం ఉపాధి కల్పించనున్నట్లు పేర్కొన్నారు. ఈ నెల 18 లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ సమావేశంలో పులిజాల యాదగిరిరావు, దోమలపల్లి శశిధర్, గుండ్లపల్లి వెంకటేశ్వరరావు, ఆకెళ్ల శ్రీనివాస్, విజయకుమార్‌శర్మ, ఫణి ఆచార్య, రంగరాజు శ్రీనివాసరావు, మారుతి శర్మ, నవనీత్‌శర్మ, జయప్రద, శ్రీదేవి, మానస తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్ ఆదేశాలు బేఖాతర్!



దామరచర్లలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట కూల్చి వేయకుండా వదిలేసిన కట్టడాలు

- దామరచర్లలో అక్రమ కట్టడాలను కూల్చని మండల అధికారులు
- కూల్చామంటూ ఉన్నతాధికారులకు తప్పుడు నివేదిక అందజేత!
- ఓ ప్రజాప్రతినిధి ఫోన్‌తో ఆగిన కూల్చివేతలు

మిర్యాలగూడ: దామరచర్లలో అక్రమ కట్టడాల విషయంలో కలెక్టర్ ఆదేశాలను కింది స్థాయి అధికారులు బేఖాతరు చేస్తూ తప్పుడు సమాచారం అందించినట్లు తెలుస్తోంది. దామరచర్ల మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట సర్వే నంబర్ 825లోని ప్రభుత్వ భూమిలో నిర్మించిన అక్రమ కట్టడాలపై ఈ ఏడాది మార్చి నుంచి ఈ నెల మొదటి వారం వరకు సాక్షి దినపత్రికలో ప్రచురితమైన వరుస కథనాలపై జిల్లా కలెక్టర్ స్పందించారు. అక్రమ కట్టడాలను వెంటనే కూల్చాలని ఆర్డీఓ, తహసీల్దార్‌కు రాతపూర్వకంగా ఆదేశాలు జారీ చేశారు. అయితే ఓ ప్రజాప్రతినిధి అక్రమ కట్టడాలను కూల్చొద్దంటూ హుకుం జారీ చేయడంతో కిందిస్థాయి సిబ్బంది సాహసం చేయలేదని సమాచారం. ఇదిలా ఉండగా గత మూడు రోజుల క్రితం ప్రొక్లెయిన్ తీసుకొచ్చి అక్రమ కట్టడాలను కూలుస్తున్నట్లు వీడియో, ఫొటోలను తీసి మమా అనిపించారు. అక్రమ కట్టడాలను కూల్చివేయకుండానే కూల్చామంటూ ఉన్నతాధికారులకు తప్పుడు నివేదిక ఇచ్చినట్లు తెలిసింది. అయితే దామరచర్లలో ప్రభుత్వ భూముల ఆక్రమణ, అక్రమ కట్టడాల కూల్చివేతల విషయంలో అధికార పార్టీ నాయకుల పెత్తనం చెలాయిస్తున్న కారణంగా అధికారులు తమ విధులను సజావుగా నిర్వర్తించేందుకు జంకుతున్నారని పలువురు చర్చించుకుంటున్నారు.

ఆక్రమణలకు పాల్పడితే కఠిన చర్యలు

ప్రభుత్వ భూముల కబ్జాలపై సమగ్ర విచారణ జరిపి ఆక్రమణలు జరిగితే స్వాధీనం చేసుకుంటాం. ఇప్పటికే అక్రమ కట్టడాలపై కలెక్టర్‌కు నివేదిక అందజేసాం. ఆదేశాలు రాగానే కఠిన చర్యలు తీసుకుంటాం.

– ఎండీ.ఖాదర్, నాయబ్ తహసీల్దార్, దామరచర్ల

సరికొత్తగా డయాలసిస్ కేంద్రం

- ఆధునీకరణ దిశగా నల్లగొండలోని సెంటర్
- కొత్త ఏజెన్సీకి బాధ్యతల అప్పగింత
- ఇప్పటికే కొత్త ఏసీలు ఏర్పాటు
- రెండు రోజుల్లో మిషన్ల బిగించే అవకాశం
- తీరనున్న రోగుల ఇబ్బందులు



నల్లగొండ జీజీహెచ్‌లోని డయాలసిస్ కేంద్రం

నల్లగొండ టౌన్: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి (జీజీహెచ్)లోని డయాలసిస్ కేంద్రం సరికొత్తగా మారబోతోంది. రోగుల సంఖ్యను బట్టి సకాలంలో సేవలందించేందుకు ఈ సెంటర్‌ను ఆధునీకరిస్తున్నారు. దీంట్లో భాగంగా కొన్ని రోజులుగా పనులు కొనసాగుతున్నాయి. అయితే నల్లగొండ జీజీహెచ్‌లో 2018 సంవత్సరంలో పది మిషన్లతో డయాలసిస్ కేంద్రాన్ని ప్రభుత్వం ప్రారంభించింది. అప్పుడు మూడు ఏసీలు ఏర్పాటు చేసి జిల్లా వ్యాప్తంగా ఉన్న డయాలసిస్ రోగులకు మూడు షిఫ్టుల్లో సేవలను అందిస్తూ వస్తున్నారు. ఏసీలు ఏడాది కాలంగా పనిచేయడం లేదు. వీటికితోడు డయాలసిస్ మిషన్లు పాతవి కావడంతో ప్రతిరోజూ ఏదో ఒక మిషన్ మొరాయిస్తోంది. ఫలితంగా రోగులు సకాలంలో డయాలసిస్ సేవలు అందక ఇబ్బందులు పడుతున్నారు. ఎండాకాలంలో సైతం ఏసీలు పనిచేయకున్నా ఏజెన్సీ నిర్వాహకులు పట్టించుకోకపోవడంతో రోగులు నరకయాతన అనుభవించారు. దీంతో ఈ సెంటర్‌ను ఆధునీకరించాలని ప్రభుత్వం నిర్ణయించింది.

కొత్త ఏజెన్సీకి నిర్వహణ బాధ్యతలు

నల్లగొండ జీజీహెచ్‌లోని డయాలసిస్ కేంద్రం నిర్వహణ బాధ్యతలను ప్రభుత్వం కొత్తగా శాప్ మెడికల్స్ ప్రైవేట్ లిమిటెడ్ ఏజెన్సీకి అప్పగించింది. ఇంతకు ముందున్న ఏజెన్సీని తొలగించి ఈ చర్యలు తీసుకుంది. దీంతో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్నటువంటి ప్రభుత్వ ఆస్పత్రుల్లో డయాలసిస్ కేంద్రాల నిర్వహణ బాధ్యతలను ఇకనుంచి కొత్త ఏజెన్సీ చూడనుంది. ఇందులో భాగంగా కొత్తగా బాధ్యతలను స్వీకరించిన ఏజెన్సీ ముందుగా జిల్లా కేంద్రంలోని డయాలసిస్ కేంద్రాన్ని ఆధునీకరించేందుకు చర్యలు ప్రారంభించింది. ఇప్పటికే కేంద్రంలో మరమ్మతులకు గురైన పాత ఏసీలను తొలగించి కొత్త ఏసీలను బిగించింది. దాంతో పాటుగా పది కొత్త డయాలసిస్ మిషన్లను తెప్పించింది. వీటిని మరో రెండు, మూడు రోజుల్లో బిగించనున్నట్లు తెలిసింది. కొత్త మిషన్లను అందుబాటులోకి తీసుకొస్తే రోగులకు మెరుగైన సేవలు అందుతాయి. ఇక్కడ రోజూ మూడు షిఫ్టుల్లో 30మందికి డయాలసిస్ సేవలను అందిస్తున్నారు. గతంలో మిషన్లు మొరాయించడంతో సకాలంలో డయాలసిస్ సేవలు అందక రోగులు ఇబ్బందులు పడ్డారు. కానీ ప్రస్తుతం కేంద్రం ఆధునీకరణ వల్ల సకాలంలో సేవలు అందడంతో ఇబ్బందులు తొలగిపోనున్నాయి.

మెరుగైన సేవలు అందుతాయి



నల్లగొండ జీజీహెచ్‌లోని డయాలసిస్ కేంద్రం పూర్తిగా ఆధునీకరిస్తున్నాం. ఇప్పటికే కొత్త ఏసీలను బిగించాం. రోగులకు సకాలంలో సేవలందించేందుకు కొత్తగా పది డయాలసిస్ మిషన్లు తెప్పించాం. వాటిని రెండు, మూడు రోజుల్లో బిగిస్తాం. అదనంగా మరో ఐదు మిషన్లు మంజూరైతే రోగులు నిరీక్షించకుండా సకాలంలో డయాలసిస్ సేవలు అందుతాయి.

– మహ్మద్ అఖిల్, ఉమ్మడి జిల్లా డయాలసిస్ సెంటర్స్ కోఆర్డినేటర్

వీఆర్‌ఏలకు రీ అలాట్‌మెంట్ ఆర్డర్లు

- జేపీఎస్‌లకూ రెగ్యులరైజేషన్ ప్రొసీడింగ్స్
- నేడు నల్లగొండలో మంత్రి జగదీష్‌రెడ్డి చేతుల మీదుగా అందజేత
- ప్రభుత్వ ఉద్యోగులుగా మారనున్న 1,649 మంది సిబ్బంది



నల్లగొండ: వీఆర్‌ఏలు, జూనియర్ పంచాయతీ కార్యదర్శులు (జేపీఎస్) రెగ్యులర్ ఉద్యోగులుగా మారబోతున్నారు. ప్రభుత్వం వీఆర్‌ఏ వ్యవస్థను రద్దు చేసి అందులో పనిచేస్తున్న సిబ్బందిని వివిధ శాఖల్లో ఇటీవల సర్దుబాటు చేసింది. అదేవిధంగా నాలుగేళ్ల సర్వీస్ పూర్తి చేసిన జూనియర్ పంచాయతీ కార్యదర్శులను రెగ్యులరైజ్ చేయాలని నిర్ణయం తీసుకుంది. అందుకు సంబంధించిన రెగ్యులరైజ్ ఆర్డర్లను గురువారం జిల్లా మంత్రి గుంటకండ్ల జగదీష్‌రెడ్డి చేతులు మీదుగా ఉద్యోగులకు అందించనున్నారు.

1,001మంది వీఆర్‌ఏలకు..

వీఆర్‌ఓ వ్యవస్థను రద్దుచేసిన ప్రభుత్వం అందులోని ఉద్యోగులను వివిధ శాఖల్లో సర్దుబాటు చేసిన విషయం తెలిసిందే. వీరితోపాటు 1,001 మంది వీఆర్‌ఏలను వివిధ విభాగాల్లో అలాట్ చేసింది. వీరికి ప్రస్తుతం రీ అలాంట్ మెంట్ ఆర్డర్లు ఇవ్వనున్నారు.

జేపీఎస్‌లకు రెగ్యులరైజ్ ఉత్తర్వులు

జిల్లాలో నాలుగేళ్ల సర్వీస్ పూర్తి చేసుకున్న మొత్తం 648 మంది జేపీలను ప్రభుత్వం రెగ్యులరైజ్ చేస్తామని హామీ ఇచ్చిన మేరకు మార్గదర్శకాలు విడుదల చేసింది. వారి పనితీరు ఆధారంగా మార్కులు వేసి రెగ్యులరైజ్ చేసే ప్రక్రియ జిల్లాలో కొనసాగుతుంది. అయితే ప్రస్తుతం 648 మంది ఉండగా జేపీఎస్‌లు ఇప్పటి వరకు 393 మంది మాత్రమే నాలుగేళ్ల సర్వీస్ పూర్తి చేసుకున్నారు. సెప్టెంబర్ మాసంలో మరో 66 మంది సర్వీస్ పూర్తవుతుంది. ప్రస్తుతం 393 మందికి రెగ్యులరైజ్ కానున్నారు. మిగతా వారిని తర్వాత చేయనున్నారు. గురువారం నల్లగొండలో వీఆర్‌ఏలకు రీ అలాంట్‌మెంట్ ఆర్డర్లతోపాటు జేపీఎస్‌లకు గ్రేడ్-4 కార్యదర్శులుగా రెగ్యులరైజ్ ఉత్తర్వులు అందించనున్నారు.

క్లుప్తంగా

తాటిచెట్టు పైనుంచి పడి గీత కార్మికుడు మృతి

వలిగొండ : ప్రమాదవశాత్తు తాటిచెట్టు పైనుంచి కిందపడి ఓ గీత కార్మికుడు మృతిచెందాడు. వలిగొండ మండలం ప్రొద్దుటూరు గ్రామంలో బుధవారం చోటు చేసుకున్న ఈ ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. వలిగొండ మండలంలోని ప్రొద్దుటూరుకు చెందిన బత్తుల శ్రీనివాస్(48) రోజూ మాదిరిగా కల్లు తీయడానికి గ్రామ శివారులోని తాటిచెట్టు ఎక్కాడు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు జారిపడడంతో తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతిచెందాడు. స్థానిక రైతులు గమనించి కుటుంబ సభ్యులు, పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని భువనగిరి జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించారు. మృతుడి కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ ప్రభాకర్ తెలిపారు.

చోరీ కేసులో నిందితుడికి ఆరు నెలల జైలు

చివ్వెంల(సూర్యాపేట) : బైక్‌ల అపహరణ కేసులో నిందితుడికి ఆరు నెలల జైలు శిక్ష విధిస్తూ సూర్యాపేట జూనియర్ సివిల్ జడ్జి కామిశెట్టి సురేష్ బుధవారం తీర్పు చెప్పారు. మునగాల మండల కేంద్రానికి చెందిన పందిరి ప్రదీప్‌రెడ్డి వృత్తి రీత్యా బైక్ మెకానిక్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. విలాసవంతమైన జీవితం గడిపేందుకు బైక్‌లను అపహరించి, వాటిని విక్రయించగా వచ్చిన డబ్బుతో జల్సాలు చేస్తున్నాడు. ప్రదీప్‌రెడ్డి 2022లో సూర్యాపేటలో నాలుగు, కేతేపల్లిలో ఒక బైక్‌ను అపహరించాడు. బాధితుల ఫిర్యాదు మేరకు సూర్యాపేట సీఐ రాజశేఖర్ ఆదేశాల మేరకు ఎస్‌ఐ శ్రీనివాస్ కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. సీసీ కెమెరాల ఆధారంగా బైక్‌లను చోరీ చేసింది.. ప్రదీప్‌రెడ్డేనని పోలీసులు గుర్తించారు. అతడిని అరెస్టు చేసి విచారించగా చోరీ చేసి విక్రయించిన బైక్‌ల వివరాలు వెల్లడించాడు. నిందితుడిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరిచారు. పీపీ హేమలత వాదనలను ఏకీభవించిన న్యాయమూర్తి నిందితుడికి 6 నెలల జైలు శిక్ష విధించారు. పీపీకి కోర్టు కానిస్టేబుల్ గన్న ప్రతాప్ వర్మ సహరించారు.

కబడ్డీ కోచ్‌గా నకిరేకల్ వాసి


గంజి సాయి

నకిరేకల్ : నకిరేకల్ పట్టణానికి చెందిన గంజి సాయి నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ స్పోర్ట్స్ (ఎన్ఐఎస్) కోచ్‌గా వ్యవహరించనున్నారు. ఇటీవల స్పోర్ట్స్ ఆథారిటీ ఆఫ్ ఇండియా (ఎస్ఏఐ),నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ స్పోర్ట్స్ ఆధ్వర్యంలో బెంగళూరులో నిర్వహించిన కబడ్డీ కోచ్‌ల క్యాంపులో నకిరేకల్ వాసి గంజి సాయి శిక్షణలో ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణత సాధించాడు. బెంగళూరు జోనా కాలేజ్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగం డాక్టర్ హసన్ జానీ చేతుల మీదుగా ధ్రువీకరణ పత్రం తీసుకున్నానని సాయి తెలిపారు.

జేఎన్‌వీ ప్రవేశ పరీక్ష దరఖాస్తు గడువు పెంపు

పెద్దవూర: మండలంలోని చలకుర్తి జవహర్ నవోదయ విద్యాలయంలో 2024–25 విద్యా సంవత్సరానికి ఆరో తరగతిలో ప్రవేశానికి దరఖాస్తు గడువును ఈ నెల 17వ తేదీ వరకు పొడిగించినట్లు ప్రిన్సిపాల్ నాగభూషణం బుధవారం తెలిపారు. ఆరో తరగతిలో ప్రవేశానికి విద్యార్థుల సౌకర్యార్థం ఈ నెల 17 వరకు పొడిగించినట్లు తెలిపారు. ఎలాంటి రుసుము లేకుండా డబ్ల్యూ.డబ్ల్యూ.డబ్ల్యూ.నవోదయ.జీఓవీ.ఇన్ లేదా డబ్ల్యూ.డబ్ల్యూ.డబ్ల్యూ.నల్లగొండ.జీఓవీ.ఇన్ వెబ్‌సైట్ల నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

నీట మునిగి ఇద్దరు విద్యార్థుల మృతి

- మృత్యువులోనూ వీడని స్నేహ బంధం
- గేదెలు మేపేందుకు వెళ్లగా దుర్ఘటన



ఉపేందర్, అనిల్ మృతదేహాల వద్ద రోదిస్తున్న తల్లిదండ్రులు, ఇతర కుటుంబ సభ్యులు, బంధువులు

కోదాడరూరల్ : గేదెలు మేపేందుకు వెళ్లిన ఇద్దరు స్నేహితులు నీటి గుంటలో మునిగి ప్రాణాలు విడిచారు. సూర్యాపేట జిల్లాలో చోటు చేసుకున్న ఈ విషాదకర ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. కోదాడ మండలం రెడ్లకుంట గ్రామానికి చెందిన పాలంపల్లి స్వామి, అన్నపూర్ణ దంపతుల పెద్ద కుమారుడు అనిల్‌కుమార్(15) కాపుగల్లులో 10వ తరగతి చదువుతున్నాడు. ఇదే గ్రామానినికి చెందిన చిర్రా తిరపయ్య సునీతల కుమారుడు ఉపేందర్ (13) కోదాడలోని ప్రభుత్వ హాస్టల్‌లో ఉంటూ 7వ తరగతి చదువుతున్నాడు. ఉపేందర్‌కు జ్వరం రావడంతో వారం రోజుల క్రితం స్వగ్రామానికి వచ్చాడు. అనిల్‌కుమార్, ఉపేందర్ స్నేహితులు. కాగా, అనిల్‌కుమార్ తల్లికి కళ్లకలక రావడంతో బుధవారం కుమారుడిని గేదెల వద్దకు పంపింది. విషయం తెలుసుకున్న ఉపేందర్ మధ్యాహ్నం తర్వాత స్నేహితుడు అనిల్ వద్దకు వెళ్లాడు. ఇద్దరూ కలిసి గ్రామ శివారులోని ప్రభుత్వ భూమిలో గేదెలను మేపుతున్నారు.

ఈతరాక నీట మునిగి..

ప్రభుత్వ భూమిలో కొందరు మట్టికోసం పెద్ద గుంటను తవ్వగా ఇటీవల కురిసిన వర్షాలకు నిండింది. ఆ గుంటలోకి గేదెలు వెళితే ఒడ్డుకు మళ్లించేందుకు దిగారో లేక ఈత కొట్టేందుకు దిగారో తెలియదు గానీ, అనిల్‌కుమార్, ఉపేందర్ ఒంటిపై ఉన్న దుస్తులు విప్పి నీటిలోకి దిగారు. లోతు ఎక్కువగా ఉండడం, ఈత రాకపోవడంతో నీట మునిగి మృతిచెందారు. సాయంత్రమైనా అనిల్ ఇంటికి రాకపోవడంతో తల్లి అన్నపూర్ణ


అనిల్‌కుమార్ (ఫైల్)


ఉపేందర్ (ఫైల్)

వెతుక్కుంటూ గ్రామ శివారుకు వచ్చింది. రోడ్డు వెంట గేదెలు ఉండగా కుమారుడు కనిపించలేదు. సమీపంలోని నీటి గుంట వద్ద దుస్తులు కనిపించడంతో లబోదిబోమంది. దీంతో రోడ్డు వెంట వెళ్తున్న వారు వచ్చి నీటి గుంటలోకి దిగగా కాళ్లకు ఇద్దరి మృతదేహాలు తగలడంతో బయటికి తీశారు. విషయం తెలుసుకుని అక్కడికి చేరుకున్న కుటుంబ సభ్యులు, బంధుమిత్రుల రోదనలు మిన్నంటాయి. మృత్యువు సైతం మీ స్నేహబంధాన్ని విడదీయలేకపోయిందా అంటూ గుండెల విసేలా రోదించిన తీరు అక్కడున్న వారిని కంటతడి పెట్టించింది. పోలీసులు వచ్చి పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాలను తరలించేందుకు ప్రయత్నించగా మృతుల కుటుంబ సభ్యులు, బంధువులు అడ్డుకున్నారు. ప్రభుత్వ భూమిలో మట్టి తవ్విన వారిపై చర్యలు తీసుకుని, తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. అప్పటి వరకు మృతదేహాలను తరలించేది లేదని భీష్మించారు. ఫిర్యాదు చేస్తే విచారణ జరిపి బాధ్యులపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని రూరల్ పోలీస్‌స్టేషన్ ఇన్‌చార్జ్ ఎస్‌ఐ యాదవేందర్‌రెడ్డి హామీ ఇవ్వడంతో శాంతించారు. అనంతరం మృతదేహాలను కోదాడ ఆస్పత్రికి తరలించారు.

ఆర్టీసీ కార్మికులకు మంచి రోజులు

- విలీన ప్రక్రియపై అధ్యయనానికి విజయవాడకు వెళ్తున్నాం
- వారం రోజుల్లో పూర్తిస్థాయి గెజిట్ వస్తుంది
- తెలంగాణ మజ్దూర్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి థామస్‌రెడ్డి


సూర్యాపేట : మాట్లాడుతున్న తెలంగాణ మజ్దూర్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి థామస్‌రెడ్డి

భానుపురి(సూర్యాపేట) : ముఖ్యమంత్రి కేసీఆర్ తీసుకున్న సాహసోపేతమైన నిర్ణయంతో ఆర్టీసీ కార్మికులకు మంచి రోజులు వచ్చాయని తెలంగాణ మజ్దూర్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి థామస్‌రెడ్డి అన్నారు. బుధవారం విజయవాడ పర్యటనకు వెళుతున్న ఆయనకు సూర్యాపేటలో ఆర్టీసీ డిపో వద్ద కార్మికులు, టీఎంయూ నాయకులు పెద్ద సంఖ్యలో స్వాగతం పలికారు. అనంతరం సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేసి మాట్లాడారు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయడానికి ప్రక్రియలో భాగంగా అధ్యయనం కోసం విజయవాడకు వెళ్తున్నామని చెప్పారు. ఆర్టీసీ కార్మికుల చిరకాల కోరిక నెరవేరిందన్నారు. ఎన్ని ఇబ్బందులు ఉన్నా.. సీఎం కేసీఆర్ కార్మికుల కోరికను తీర్చారని చెప్పారు. ప్రభుత్వరంగ సంస్థలను ప్రభుత్వమే కాపాడుతుందని చెప్పి సీఎం కేసీఆర్ ఈ నిర్ణయం తీసుకున్నారని అన్నారు. ముఖ్యమంత్రి నిర్ణయంతో 43వేల మంది కార్మికుల కుటుంబాల్లో వెలుగులు నిండుతున్నాయన్నారు. ఆర్టీసీ బిల్లు రాజ్‌భవన్‌కు వెళ్లిన సమయంలో హైడ్రామా జరిగిందని, ఇప్పుడు బిల్లు పాస్ కాకుంటే కార్మికులు అంధకారంలోకి వెళ్తారని చెప్పి తెలంగాణ మజ్దూర్ యూనియన్ ఆందోళనలకు పిలుపునిచ్చిందన్నారు. ఒక్కరోజులోనే 7వేల మంది కార్మికులు రాజ్‌భవన్ ముట్టడికి వచ్చారని తెలిపారు. తదనంతరం గవర్నర్ కార్మికుల సమస్యలు విని ప్రభుత్వ సమాధానాలతో ఆమోదం తెలిపారని చెప్పారు. అసెంబ్లీలో బిల్లు పాస్ కావడం ఆర్టీసీ కార్మికుల విజయమని థామస్‌రెడ్డి అన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో విలీనం సమయంలో కొన్ని ఇబ్బందులు వచ్చాయని, కార్మికులకు అన్యాయం జరిగిందని, ఇక్కడ ఆ పరిస్థితి లేకుండా ఉండేందుకు అధ్యయన కమిటీ ఏర్పడిందన్నారు. 8మంది సభ్యులతో కూడిన కమిటీ రెండు రోజుల పాటు విజయవాడలో విలీన ప్రక్రియను అధ్యయనం చేయనున్నట్లు తెలిపారు. వారం రోజుల్లోనే పూర్తి స్థాయిలో గెజిట్ వచ్చే అవకాశం ఉందన్నారు. విలీనంపై ఎవరికీ అనుమానాలు అవసరం లేదన్నారు. నూతన బస్సులు కొనుగోళ్లు జరుగుతున్నాయన్నారు. ఈ సందర్భంగా సంఘం చీఫ్ అడ్వయిజర్ యాదయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్ కమలాకర్‌గౌడ్, కోశాధికారి రాఘవరెడ్డి, కార్యదర్శి సత్యనారాయణ, బి.నరేందర్‌లను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో టీఎంయూ హైదరాబాద్ జోన్ జాయింట్ సెక్రటరీ సుంకరి శ్రీనివాస్, సీనియర్ నాయకులు బెల్లి నర్సయ్య, ఎస్ఎస్ గౌడ్, బొజ్జ సైదులు, మాచర్ల లచ్చయ్య, చెరుకు వెంకటయ్య, చల్కపల్లి వెంకన్న, ఎండీ.జాని, ఇండ్ల నరేష్, గోవిందరాజులు, సావిత్రి, మేరీ, స్వరూప, మాధవి, రేణుక తదితరులు పాల్గొన్నారు.

పది రోజుల్లో బర్త్‌డే.. ఇంతలోనే విషాదం

- నీటి గుంటలో పడి బాలుడు మృతి


ధ్రుపత్(ఫైల్)

కనగల్ : మరో పది రోజుల్లో జన్మదిన వేడుకను జరుపుకోనున్న బాలుడు ప్రమాదవశాత్తు నీటి గుంటలో పడి మృతిచెందాడు. నల్లగొండ జిల్లాలో జరిగిన ఈ విషాదకర ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. కనగల్ మండలం పానుగోడు గ్రామానికి చెందిన పుకరం మల్లికార్జున్‌రావు, పావని దంపతులకు కుమార్తె దాక్షాయిని, కుమారుడు ధ్రుపత్ (2) సంతానం. మల్లికార్జున్‌రావు పెద్దవూర గురుకుల పాఠశాలలో కాంట్రాక్ట్ పద్ధతిన పీఈటీగా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. చండూరు పట్టణంలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో ఎల్‌కేజీ చదువుతున్న దాక్షాయిని నిత్యం బస్సులో వెళ్లి వస్తుంది. అయితే, సోదరి పాఠశాలకు వెళ్లే సమయంలో ధ్రుపత్ వెంట వస్తానని మారాం చేస్తుంటాడు. దీంతో పావని బుధవారం ఉదయం ధ్రుపత్‌ను సమీప బంధువు ఇంట్లో వదిలి కుమార్తెను తీసుకుని బస్టాప్‌కు వెళ్లింది.

బంధువు ఇంటి నుంచి వెళ్లిపోయి..

ధ్రుపత్‌కు సమీప బంధువు జామకాయ ఇచ్చి తింటూ ఆడుకోమని చెప్పి ఆమె ఇంటి పనిలో నిమగ్నమైంది. ఈ క్రమంలో ధ్రుపత్ గేటు తీసుకుని ఇంటి నుంచి బయటికి వెళ్లిపోయాడు. పావని ఇంటికి


నీటి గుంటను పరిశీలిస్తున్న పోలీసులు

వచ్చిన తర్వాత ధ్రుపత్‌ను తీసుకువెళ్లేందుకు బంధువు ఇంటికి వెళ్లగా అక్కడ కుమారుడు కనిపించలేదు. మూడు గంటల పాటు గ్రామంలో వెతుకులాడగా గ్రామ మాజీ సర్పంచ్ ఇంటి పరిసరాల్లో ఓ మహిళ ఇల్లు నిర్మించుకునేందుకు తీసిన నీటి గుంటలో ధ్రుపత్ విగతజీవుడై తేలియాడుతూ కనిపించాడు. ముక్కుపచ్చలారని కుమారుడు ఇక లేడని తెలుసుకుని తల్లి గుండెలవిసేలా రోదించిన తీరు అందరినీ కంటతడి పెట్టించింది. విషయం తెలుసుకున్న చండూరు సీఐ వెంకట్, ఎస్‌ఐ అంతిరెడ్డి ఘటనా స్థలాన్ని పరిశీలించారు. బాలుడి మృతదేహాన్ని వెలికితీయించి పోస్టుమార్టం నిమిత్తం నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. కాగా, ధ్రుపత్ మరణంపై గ్రామంలో అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.

సోమోరిగూడెం సర్పంచ్ మృతి


నర్సింగ్ శంకర్ (ఫైల్)

నిడమనూరు: బీఆర్ఎస్ నాయకుడు, నిడమనూరు మండలంలోని సోమోరిగూడెం సర్పంచ్ నర్సింగ్ శంకర్ (50) బుధవారం మృతిచెందాడు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన మధ్యాహ్నం ఇంట్లోనే కన్నుమూసినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ముప్పారం నుంచి కొత్తగా ఏర్పడిన సోమోరిగూడేనికి మొదటి సర్పంచ్‌గా శంకర్ ఎన్నికయ్యాడు. శంకర్‌కు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. గురువారం గ్రామంలో అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

కొత్త పంచాయతీల సర్పంచ్‌లు ఇద్దరూ..

ముప్పారం గ్రామ పంచాయతీ నుంచి సోమోరిగూడెం, గుంటుకగూడెం గత స్థానిక సంస్థల ఎన్నికలకు ముందు గ్రామ పంచాయతీలుగా ఏర్పడ్డాయి. గుంటుకగూడెం సర్పంచ్‌గా ఎన్నికైన నస్వామి గెలిచిన ఆరు నెలలకే గుండెపోటుతో, ప్రస్తుతం సోమోరిగూడెం సర్పంచ్ శంకర్ సైతం మృతిచెందాడు. ఒకే గ్రామ పంచాయతీ నుంచి ఏర్పడిన రెండు కొత్త గ్రామ పంచాయతీల మొదటి సర్పంచ్‌లు అనారోగ్యంతో మృతిచెందడం మండలంలో చర్చనీయాంశంగా మారింది. సోమోరిగూడెం సర్పంచ్ నర్సింగ్ శంకర్ మృతికి బీఆర్ఎస్ నాయకులు సంతాపం తెలిపారు.

మెరుగైన వైద్య సేవలు అందించాలి

- ముక్తాపూర్ హెల్త్ అండ్ వెల్‌నెస్ సెంటర్‌ను సందర్శించిన కేంద్ర బృందం


ఫార్మసీ విభాగాన్ని పరిశీలిస్తున్న కేంద్ర క్వాలిటీ అనాలసిస్ బృందం

భూదాన్‌పోచంపల్లి : ప్రభుత్వం నిర్దేశించిన సూచనల మేరకు పేదలకు మెరుగైన వైద్యసేవలు అందించాలని కేంద్ర క్వాలిటీ అనాలిసిస్ అస్సెస్‌మెంట్ బృందం కోరింది. భూదాన్‌పోచంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని ముక్తాపూర్ హెల్త్ అండ్ వెల్‌నెస్ సెంటర్‌ను బుధవారం కేంద్ర క్వాలిటీ అనాలిసిస్ అస్సెస్‌మెంట్ బృందం సందర్శించింది. పర్యవేక్షకులు డాక్టర్ విజయరామనన్, డాక్టర్ భరణికుమార్‌లు హెల్త్ అండ్ వెల్‌నెస్ సెంటర్ ద్వారా రోగులకు అందుతున్న వైద్యసేవలు, విభాగాల వారీగా రికార్డులు పరిశీలించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలు, జాతీయ రోగ నిరోధక కార్యక్రమాలపై ఆరా తీశారు. వైద్యసేవల పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ యశోద, జిల్లా ఎన్‌సీడీ ప్రోగ్రామ్ అధికారి డాక్టర్ సుమన్‌కల్యాణ్, వైద్యాధికారులు యాదగిరి, శ్రీనివాస్, సందీప్, జిల్లా క్వాలిటీ మేనేజర్ రిజ్వాన్, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ పోతారెడ్డి, సూపర్‌వైజర్ అరుంధతి, ఆరోగ్య కార్యకర్తలు భవాని, నాగమణి, వాణి, రేణుక, ఎంఏ బేగ్, ఆశాలు నాగమణి, మనోహర, చందన, రాధిక, ఫార్మాసిస్ట్ కవిత, లక్ష్మణ్‌బాబు, గోపాల్‌రావు పాల్గొన్నారు.

కుటుంబ కలహాలతో మహిళ ఆత్మహత్య

చింతపల్లి : కుటుంబ కలహాలతో ఓ మహిళ ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటన చింతపల్లి మండల పరిధిలోని కొర్ర మాన్‌సింగ్‌తండాలో బుధవారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ సతీష్‌రెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కొర్ర మాన్‌సింగ్‌తండాకు చెందిన రమావత్ కవిత(45) భర్త బాలుతో తగాదాపడి మంగళవారం రాత్రి ఇంటి నుంచి వెళ్లిపోయింది. కుటుంబ సభ్యులు రాత్రి తండాతో పాటు బంధువుల ఇళ్లలో వెతికినా ఆచూకీ లభ్యం కాలేదు. బుధవారం గ్రామానికి సమీపంలోని వాగులో కవిత మృతదేహాన్ని స్థానికులు గుర్తించడంతో విషయం వెలుగులోకి వచ్చింది. పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని దేవరకొండ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

విద్యుత్ ఉద్యోగి అదృశ్యం


మురళీకృష్ణ

నాగార్జునసాగర్: విద్యుత్ ఉద్యోగి అదృశ్యమయ్యాడు.నాగార్జునసాగర్ పైలాన్ కాలనీలోని విద్యుదుత్పాదన కేంద్రంలో అటెండర్‌గా పనిచేస్తున్న మజ్జి మురళీకృష్ణ స్థానికంగా నివాసం ఉంటున్నాడు. ఈ నెల 7న ఇంటి నుంచి బయటికి వెళ్లిన మురళీకృష్ణ రాత్రి వరకు తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు విద్యుదుత్పాదన కేంద్రం, బంధువుల ఇళ్లలో ఆరా తీసినా ఆచూకీ లభించలేదు. దీంతో మురళీకృష్ణ భార్య లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు విజయపురిటౌన్ ఎస్‌ఐ సంపత్ తెలిపారు.

కేవీకేలో 'నా మట్టి.. నా దేశం' వారోత్సవాలు


విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న శాస్త్రవేత్తలు

గరిడేపల్లి : గరిడేపల్లి మండలం గడ్డిపల్లిలోని కేవీకేలో ఆజాద్ కా అమృత్ మహోత్సవం ముగింపు కార్యక్రమంలో భాగంగా 'నా మట్టి..నా దేశం' వారోత్సవ కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు కేవీకే సీనియర్ శాస్త్రవేత్త బి.లవకుమార్ తెలిపారు. బుధవారం ఈ కార్యక్రమంలో భాగంగా మొదట ప్రతిజ్ఞతో ప్రారంభించి విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. దేశ మంతటా వివిధ ప్రాంతాల నుంచి 7500 కలశాల్లోని పవిత్ర మట్టితో పాటు మొక్కలను ఢిల్లీకి తీసుకెళ్లడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని తెలిపారు. పవిత్రమైన మట్టితో ఢిల్లీలోని జాతీయ యుద్ధ స్మారకం సమీపంలో అమృత్ వాటికను నిర్మించనున్నారు. ఆ అమృత్ వాటికలోనే మొక్కలను నాటనున్నట్లు తెలిపారు. ఈ అమృత్ వాటిక ఏక్ భారత్ శ్రేష్ఠ భారత్‌కు గొప్ప చిహ్నంలా నిలుస్తుందన్నారు. మన్‌కీ బాత్ 103 ఎడిషన్ సందర్భంగా ప్రధాన మంత్రి మోదీ ఈ విషయాన్ని ప్రకటించారని తెలిపారు. ఆగస్టు 9 నుంచి 14వ తేదీ వరకు ఈ కార్యక్రమాన్ని జిల్లాలోని వివిధ గ్రామాల్లో నిర్వహిస్తారని పేర్కొన్నారు. అనంతరం విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్తలు కిరణ్, గనరేష్, ఆదర్శ్, మాధురి, బీఎస్సీ వ్యవసాయ విద్యార్థులు ఉన్నారు.

పోచంపల్లిని సందర్శించిన ఒడిశా చేనేత కార్మికులు


చేనేత వస్త్రాలను పరిశీలిస్తున్న ఒడిశా కార్మికులు

భూదాన్‌పోచంపల్లి : ఒడిశా రాష్ట్రానికి చెందిన 16మంది చేనేత కార్మికులు బుధవారం పోచంపల్లిని సందర్శించారు. స్థానిక చేనేత సహకార సంఘం, కళా పునర్వి యూనిట్, చేనేత గృహాలను పరిశీలించారు. ఇక్కడ మగ్గాలపై తయారవుతున్న ఇక్కత్ వస్త్రాలు, రంగులద్దే విధానం, చిటికి కట్టడం, డిజైన్లు పరిశీలించి ఇక్కడి కార్మికుల కళానైపుణ్యాలను కొనియాడారు. ఈ సందర్భంగా ఒడిశా రాష్ట్ర హ్యాండ్లూమ్స్ అండ్ హ్యాండిక్రాఫ్ట్ ఇన్‌స్పెక్టర్ సునీల్ కుమార్ మాట్లాడుతూ పోచంపల్లి ఇక్కత్ వస్త్రాల తయారీ విధానాన్ని తెలుసుకొనేందుకు ఎక్స్‌ప్లోరర్ విజిట్‌లో భాగంగా ఒడిశాలోని జార్సిగూడ జిల్లాకు చెందిన కార్మికులతో వచ్చామని పేర్కొన్నారు. ఇక్కడి నేత విధానం, డిజైన్లు ఎంతో బాగున్నాయన్నారు.

వేర్వేరు ప్రమాదాల్లో ముగ్గురి దుర్మరణం


కేతేపల్లి : ప్రమాదానికి గురైన వాహనాలు


రవీందర్‌రెడ్డి మృతదేహంపై పడి రోదిస్తున్న కుటుంబ సభ్యులు

కేతేపల్లి: వేర్వేరు ప్రమాదాల్లో ముగ్గురు దుర్మరణం చెందారు. కేతేపల్లి, నడిగూడెం, కోదాడ మండలాల పరిధిలో చోటు చేసుకున్న ఈ ఘటనల వివరాలు ఇలా ఉన్నాయి. మహారాష్ట్రలోని నాందేడ్ జిల్లాకు చెందిన హౌగి హన్మంత్ పట్నీ(39) డీసీఎంను నడుపుకుంటూ మంగళవారం అర్ధరాత్రి విజయవాడ నుంచి హైదరాబాద్‌కు బయలుదేరాడు. మార్గమధ్యలో బుధవారం తెల్లవారుజామున కేతేపల్లికి సమీపంలోకి చేరుకోగానే రోడ్డు పక్కను నిలిపి ఉన్న మరో లారీని వెనుక నుంచి డీసీఎం బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో డీసీఎంనడుపుతున్న హన్మంత్ పట్నీకి తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. కేతేపల్లి పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని నకిరేకల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడి సోదరుడు హన్మంత్ రాచప్ప పట్నీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ శ్రీకాంత్‌గౌడ్ తెలిపారు.

ట్రాక్టర్ తిరగబడి..

నడిగూడెం : నడిగూడెం మండలం వల్లాపురం గ్రామానికి చెందిన పల్లా రవీందర్‌రెడ్డి (50) ఖమ్మం జిల్లా కూసుమంచి మండలం రాజాపేట రెవెన్యూ పరిధిలోని తన వ్యవసాయ భూమిలో బుధవారం ట్రాక్టర్‌తో దుక్కి దున్నుతున్నాడు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు ట్రాక్టర్ ఇంజన్ తిరగబడడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

లారీ ఢీకొని..

కోదాడరూరల్ : చిలుకూరు మండలం నారాయణగూడెం గ్రామానికి చెందిన అవ్వారు రాంబాయమ్మ(68) బుధవారం కోదాడలో ఉంటున్న కూతురు ఇంటికి బయలుదేరింది. కోదాడకు చేరుకున్నాక హుజూర్‌నగర్ రోడ్‌లోని అయ్యప్ప స్వామి ఆలయం వద్ద రోడ్డు దాటుతోంది. ఈ క్రమంలో కోదాడ నుంచి హుజూర్‌నగర్ వైపు వెళ్తున్న లారీ ఆమెను ఢీకొట్టింది. ఈ ప్రమదంలో రాంబాయమ్మకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందింది. ప్రమాదం జరిగిన వెంటనే డ్రైవర్ పరారయ్యాడు. మృతురాలి కుమారుడు భూషయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కాంగ్రెస్‌ను అధికారంలోకి తీసుకురావాలి

- యూత్ కాంగ్రెస్ ఎలక్షన్ కమిటీ చైర్మన్ సమరత్ మిశ్రా

నల్లగొండ: రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకురావడానికి యువజన కాంగ్రెస్ పార్టీ శ్రేణులు కీలకంగా పనిచేయాలని ఆల్ ఇండియా యూత్ కాంగ్రెస్ ఎలక్షన్ కమిటీ చైర్మన్ సమరత్ మిశ్రా పిలుపునిచ్చారు. బుధవారం నల్లగొండలోని భువనగిరి ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి క్యాంపు కార్యాలయంలో బుధవారం జరిగిన యూత్ కాంగ్రెస్ డోర్ టు డోర్ క్యాంపెయిన్ సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. నల్లగొండ అసెంబ్లీ, పార్లమెంట్ డోర్ టు డోర్ కార్యక్రమంలో మొదటి స్థానంలో ఉందన్నారు. దీంతో పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ ఆదేశాల మేరకు నల్లగొండకు వచ్చామన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే రైతు, యూత్ డిక్లరేషన్ కచ్చితంగా అమలవుతుందని స్పష్టం చేశారు. డోర్ టు డోర్ కార్యక్రమంలో క్రియాశీలకంగా పనిచేసిన యూత్ కాంగ్రెస్ నేతలు జహంగీర్, సిద్దు, శ్రీకాంత్, రహీం, వంశీలను సన్మానించారు. యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు గౌని రాజా రమేష్ యాదవ్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ టెక్నికల్ హెడ్ అభిజిత్, తెలంగాణ కంపెనీ ఇన్‌చార్జి ఆర్బిత్, కాంగ్రెస్ పార్టీ నల్లగొండ పట్టణ అధ్యక్షుడు గుమ్ముల మోహన్‌రెడ్డి, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు గాలి నాగరాజు, కొప్పు నవీన్, రాజిరెడ్డి, నరేష్ యాదవ్, పగడాల నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

రెండిళ్లలో చోరీ

నల్లగొండ క్రైం : గుర్తుతెలియని వ్యక్తులు నీలగిరిలోని రెండు ఇళ్లలో చోరీకి పాల్పడ్డారు. నల్లగొండ పట్టణంలోని రాక్‌హిల్స్ కాలనీకి చెందిన ఉపాధ్యాయుడు రాంబాబు ఇంట్లోకి మంగళవారం రాత్రి చొరబడ్డారు. అతడి ఇంట్లో విలువైన వస్తువులు దొరకలేదు. మరో రెవెన్యూ ఉద్యోగి ప్రదీప్ కుటుంబ సభ్యులు ఇంట్లో నిద్రిస్తుండగానే దుండగులు వారి వెనుక డోర్‌నుంచి వెళ్లి 15 తులాల బంగారం అపహరించుకుపోయారు. బుధవారం ఉదయం లేచి చూడగా అన్ని డోర్‌లు తీసి ఉండటంతో పాటు సామగ్రి చిందరవందరగా ఉండడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఘటనా స్థలాన్ని సీఐ పీఎన్‌డీ ప్రసాద్, ఎస్‌ఐ నాగరాజు పరిశీలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ప్రాణ హాని ఉందన్నా..

- దివ్యాంగుడికి రక్షణ కల్పించలేదని పోలీసులపై ఆరోపణలు
- కోటేశ్వర్‌రావు హత్యోదంతంలో ఖాకీల తీరుపై విమర్శల వెల్లువ
- ఎస్‌ఐ స్పందించి ఉంటే దారుణం జరిగేది కాదంటున్న బంధువులు, గ్రామస్తులు
- పోలీసుల అదుపులో హత్య కేసు ప్రధాన నిందితుడు ?


కోటేశ్వర్‌రావు (ఫైల్)

మిర్యాలగూడ అర్బన్ : అయ్యా.. నాకు ప్రాణ హాని ఉంది.. కాపాడండి మహాప్రభో అని వేడుకున్నా పట్టించుకోలే.. రక్షణ కల్పించాల్సిన పోలీసులే నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడంతోనే నిండు ప్రాణం బలైందని విమర్శలు వినిపిస్తున్నాయి. అడవిదేవులపల్లి మండలం బాల్నేపల్లి గ్రామంలో దివ్యాంగుడు జడ కోటేశ్వర్‌రావును ఈ నెల 7న దాయాది మరో ఇద్దరి సహకారంతో దారుణంగా హత్య చేసిన విషయం తెలిసిందే. బాల్నేపల్లికి చెందిన జడ కాటమయ్య, జడ అంజయ్య సోదరులు. అంజయ్యకు కోటేశ్వర్‌రావు, రాంబాబు సంతానం కాగా, కాటమయ్యకు కాశయ్య ఒక్కడే కుమారుడు. కొద్ది రోజుల క్రితం కాటమయ్యకు పక్షవాతం రావడంతో అతడి బాగోగులను కుమారుడు కాశయ్య చూడలేదు. దీంతో తమ్ముడి కుమారుడు కోటేశ్వర్‌రావు పెదనాన్నకు సపర్యలు చేశాడు. ప్రతి ఫలంగా కాటమయ్య తన పేరిట ఉన్న 30 గుంటల భూమిని నాలుగు నెలల క్రితం తహసీల్దార్ కార్యాలయంలో కోటేశ్వర్‌రావుకు రిజిస్ట్రేషన్ చేశాడు.

జీర్ణించుకోలేక.. కక్ష పెంచుకుని..

తండ్రి పేరిట ఉన్న భూమి తనకు కాకుండా బాబాయి కుమారుడికి రిజిస్ట్రేషన్ చేయడాన్ని కాశయ్య జీర్ణించుకోలేకపోయాడు. అప్పటి నుంచే కోటేశ్వర్‌రావుపై కక్ష పెంచుకుని గొడవలు సైతం పెట్టుకున్నాడు. దీంతో దివ్యాంగుడైన కోటేశ్వర్‌రావు అడవిదేవులపల్లి పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి జరిగిన విషయం చెప్పాడు. కాశయ్య వలన తనకు ప్రాణ హానీ ఉందని ఎస్‌ఐ హరిబాబుకు విన్నవించుకున్నాడు. కానీ కోటేశ్వర్‌రావు మొర ఆలకించని ఎస్‌ఐ గ్రామంలో మాట్లాడుకోవాలని ఉచిత సలహా ఇచ్చాడని బంధువులు ఆరోపిస్తున్నారు. మూడు నెలలుగా గ్రామంలో కోటేశ్వర్‌రావును చంపేస్తానని పలువురితో అంటున్న కాశయ్య తీరును గమనించిన కోటేశ్వర్‌రావు 20 రోజుల క్రితం కూడా పోలీస్‌స్టేషన్‌కు వచ్చి తన బాధ చెప్పుకున్నాడని.. కానీ, పోలీసులు కనీసం కాశయ్యను పిలిచి మాట్లాడలేదని వాపోతున్నారు. హతుడు కోటేశ్వర్‌రావు భయందోళనను దృష్టిలో ఉంచుకుని కాశయ్యను పోలీస్ స్టేషన్‌కు పిలిచి కౌన్సిలింగ్ ఇచ్చి ఉంటే దారుణం జరిగేది కాదని గ్రామస్తులు సైతం పేర్కొంటున్నారు. కాగా, భూమి తగాదా విషయంలో కోటేశ్వర్‌రావు పోలీస్‌స్టేషన్‌కు వచ్చాడని, దానిని కోర్టు ద్వారా పరిష్కరించుకోవాలని సూచించానని ఎస్‌ఐ హరిబాబు వివరణ ఇచ్చారు. హత్య కేసులో ప్రధాన నిందితుడైన కాశయ్యను ఇప్పటికే పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు తెలిసింది.